క్లుప్తంగా

వైద్యశిబిరానికి విశేష స్పందన


రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారులు

పెద్దపంజాణి: మండలంలోని రాజుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం తిరుపతికి చెందిన రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో పాల్గొన్న 120 మంది రోగులకు వైద్యాధికారులు వెంకటరమణారెడ్డి, వెంకటరమణ వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 20 మందిని ఆరోగ్యశ్రీ శస్త్రచికిత్సకు ఎంపిక చేసి తిరుపతికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో మేనేజర్ పురంధర్‌రెడ్డి, భానుప్రతాప్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, మంజునాథరెడ్డి పాల్గొన్నారు.

కనక దుర్గమ్మకు సారె సమర్పణ


సారెను తీసుకెళ్తున్న వేణుగోపాలస్వామి ఆలయ ధర్మకర్తలు, భక్తులు

గంగవరం: పట్టణంలోని పాతపేటలో కొలువుదీరిన వేణుగోపాలస్వామి ఆలయ ధర్మకర్తలు కనకదుర్గమ్మకు సారె సమర్పించారు. ఆలయంలో వేణుగోపాలస్వామికి ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ధర్మకర్తల ఆధ్వర్యంలో అక్కడి నుంచి కనకదుర్గమ్మ ఆలయం వరకు మేళతాళాలతో భక్తులు ఊరేగింపుగా సారెను తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించిన తరువాత సారెను అమ్మవారికి అలంకరించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభం ప్రతిష్టాపన


ఏర్పాటు చేసిన ధ్వజస్తంభం

పుంగనూరు: పట్టణంలోని కోనేటి వద్ద వెలసిన శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం 43 అడుగుల ఎత్తు గల ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఆలయ అర్చకులు, భక్తులు కలసి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కంచి పరమాచార్యులు అందించిన ధ్వజచక్రానికి పూజలు చేసి క్రేన్ సాయంతో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఈసందర్భంగా స్వామివారికి హోమాలు, పూజలు, మహామంగళహారతి నిర్వహించారు.

గండకి పద్య కావ్యం ఆవిష్కరణ


పద్యకావ్యాలను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

గంగవరం: మండలంలోని కళామందిరంలో రామిరెడ్డి మాధవరెడ్డి రచించిన గండకి పద్యకావ్యాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ప్రముఖ శతావధాని ఆముదాల మురళి, ప్రవచనకర్త గుమ్మడి జయరామిరెడ్డి మాట్లాడుతూ సాహిత్యం సమాజాన్ని ప్రభావితం చేసినప్పుడే చిరకాలం నిలుస్తుందన్నారు. గంగానది ఉపనది అయిన గండకి పూర్వ వృత్తాంతాన్ని తీసుకుని ఒక పద్యకావ్యం రాయడం గొప్ప విషయమన్నారు. గండకి అనే వేశ్య విష్ణుభక్తితో నదిగా మారి మహావిష్ణువును తన గర్భంలో సాలగ్రామంగా పొందిన కథను అద్భుతమైన పదకావ్యంగా మలచిన మాధవరెడ్డికి అభినందనీయమన్నారు. ఈసందర్భంగా రచయిత దంపతులను కళామందిరంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమిత అధ్యక్షుడు తులసినాథంనాయుడు, న్యాయ వాది నాగిరెడ్డి, ఆచార్య దండాల రాధాక్రిష్ణారెడ్డి, జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలోని నిత్య అన్నదాన ట్రస్టుకు ఓ దాత రూ.లక్ష నగదును విరాళంగా అందజేశారు. నగరికి చెందిన దాత గోపి కుటుంబ సభ్యులతో కలసి విరాళం నగదును ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం వారికి స్వామి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అధికారులు కోదండపాణి, విఘ్నేష్ పాల్గొన్నారు.

నేడు విజయవాడకు కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్: కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ కార్యాలయ పనుల నిమిత్తం సోమవారం విజయవాడ వెళ్లనున్నారు. జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌గా జేసీ విద్యాధరి బాధ్యతలు నిర్వహించనున్నారు. కలెక్టర్ మంగళవారం జిల్లా ప్రజలకు అందుబాటులో ఉంటారు.

నాడు కళకళ.. నేడు విలవిల!


గతంలో పచ్చగా ఉన్న పలమనేరు పెద్దచెరువు కీలేరి


మొరం వద్ద బీళ్లుగా మారిన పొలాలు


వానలు లేక తావడిపల్లె వద్ద ఎండిన వేరుశనగ పంట (ఫైల్)

- నాలుగేళ్లుగా నవంబర్‌లో భారీ వర్షాలు
- గతంలో నిండిన చెరువులు
- ఈ ఏట అడుగంటిన భూగర్భజలాలు
- ఖరీఫ్‌లో తగ్గిన వేరుశనగ సాగు
- పలమనేరు డివిజన్‌లో ఐదు కరువు మండలాలు
- వరుణుడి కోసం రైతుల ఎదురుచూపులు

పలమనేరు: చిత్తూరు జిల్లాలోనే సాగునీటికి ఇబ్బందులంటూ వర్షాలను నమ్ముకుని మెట్టభూముల్లో వేరుశనగను సాగు చేసి బతికే రైతులే పలమనేరు డివిజన్‌లో ఎక్కువగా ఉంటున్నారు. గత నాలుగైదేళ్లుగా ఈ ప్రాంతంలో నవంబర్ నెలలో భారీ వర్షాలు ప్రతి ఏటా కురిశాయి. నవంబర్, డిసెంబర్ నెలల్లో ఈ ప్రాంతంలోని 90శాతం చెరువులు మొరవెత్తాయి. కౌండిన్య నదితోపాటు వాగులు, వంకలు పొంగిపొర్లాయి. గత నాలుగేళ్లలో అన్ని పంటలు పచ్చగా కళకళలాడాయి. బోర్లలో భూగర్భజలాలు భారీగా పెరిగి గంగ పైకి పెళ్లుబికింది. కానీ ఈ దఫా తగినంత వర్షాలు పడలేదు. ఫలితంగా ఈ ప్రాంతంలో వేరుశనగ సాగు కూడా సగానికంటే తగ్గింది. పైపెచ్చు వేరుశనగకు అవసరమైన సమయంలో వానలు రాక పంట దిగుబడి భారీగా తగ్గింది. దీంతో వేరుశనగ రైతులు నష్టపోయారు. మరోవైపు ఇతర పంటలకు సైతం భూగర్భజలాలు తగ్గి బోర్లలో రెండు ఇంచ్‌లు వస్తున్న నీరు ఇప్పుడు ఇంచి కూడా రావడం లేదు. దీంతో సగానికిపైగా పొలాలు బీళ్లుగా మారాయి. ఈ ప్రాంతంలో నెలకొన్న దుర్భిక్షంతో ప్రభుత్వం ఈ డివిజన్‌లోనే ఐదు మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించింది.

ఇప్పుడు తప్పని కరువు పరిస్థితులు...

పలమనేరు డివిజన్‌లో ఏటా ఖరీఫ్‌లో వేరుశనగ సాధారణ సాగు 14,388 హెక్టార్లుగా ఉంటుంది. ఈ దఫా వ్యవసాయశాఖ రైతులకు 10,380 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను సరఫరా చేసింది. అయితే సీజన్‌లో వానలు రాక 6 వేల హెక్టార్లలో మాత్రమే పంటసాగైంది. అయితే సెప్టెంబర్‌లో చుక్క చినుకులేక వేరుశనగ ఎండుముఖం పట్టింది. అప్పట్లో ఎండలు మండుతుండడంతో పంటలపై విపరీతమైన ప్రభావం చూపింది. సెప్టెంబర్‌లో సాధారణ వర్షపాతం 105 మి.మీ కాగా ఆ నెలలో 5 మి.మీ కూడా వర్షపాతం నమోదుకాలేదు. దీంతో పంట ఎండిపోయి దిగుబడి తగ్గింది. ఫలితంగా ఎకరానికి 15 బస్తాలు పండాల్సిన పంట ఒకటి, రెండు బస్తాలకు చేరింది. ఎకరానికి రూ.30వేలు పంట పెట్టుబడిగా పెట్టిన రైతులకు కనీసం కాయకష్టం కూడా దక్కలేదు.

భారీగా తగ్గిన భూగర్భజలాలు

గతంలో 30 అడుగుల్లోనే ఉన్న గంగ నేడు సగటున 1,500 అడుగులకు చేరింది. దీంతో అరకొరగా పంటలు సాగుచేసిన ఇక్కడి రైతుల బోర్లలో నీరు రెండు ఇంచ్‌ల నుంచి ఇంచికి పడిపోయింది. ముఖ్యంగా వరిపంటకు నీటి తడులు ఇవ్వలేక ఇబ్బందులు తప్పడం లేదు. ఈ ప్రాంతంలో పెద్ద చెరువులు(ఎంఐ ట్యాంకులు) వంద దాకా ఉన్నాయి. వీటిల్లో మాడి పెద్దచెరువులో మినహా మరెక్కడా నీరు లేదు. గత నాలుగేళ్లుగా పొంగి ప్రవహించిన కౌండిన్య ఎండిపోవడంతో ఇసుకాసురులు అందులోని ఇసుకను ఇష్టానుసారంగా తోడుకుంటున్నారు. రైతులేమో భూములను బీళ్లుగా పెట్టుకొని వరుణుడి జాడ కోసం ఆకాశం వైపు ఆశగా చూస్తున్నారు.

నాడు పచ్చటి కీలేర్లు..నేడు రియల్ వెంచర్లు....

పలమనేరు పట్టణానికి ఆనుకొని ఉన్న పెద్దచెరువు కీలేర్లు గతంలో పచ్చని పంటలతో కోనసీమను తలపించేంది. కానీ ఇప్పుడు రైతులు పంటలేయక సకాలంలో వానలు పడక ఉన్న భూములను తెగనమ్ముకున్నారు. కొన్న రియల్టర్లు వాటిని వెంచర్లుగా మార్చేశారు. ఇదే పరిస్థితి పలమనేరు డివిజన్‌లోని పలు చెరువుల కీలేర్లలో ఇప్పుడు కనిపిస్తోంది.

ఐదు కరువు మండలాలు ప్రకటన..

ఇలాఇండగా పలమనేరు వ్యవసాయశాఖ డివిజన్‌లో నెలకొన్న కరువు పరిస్థితుల కారణంగా ప్రభుత్వం పలమనేరు, బైరెడ్డిపల్లి, వి.కోట, గుడుపల్లి, రామకుప్పం మండలాలను కరువు మండలాల జాబితాలో చేర్చింది. ఏదేమైనా నాటికి నేటికి ఏర్పడ్డ కరువును చూసిన జనం మేమేమి పాపం చేశాం దేవుడా అంటూ మనసులో బాధపడుతున్నారు.

గత నాలుగేళ్లలో ఏటా నవంబర్‌లో వర్షాలే..

2019 నుంచి 2023 దాకా నవంబర్‌లో ఈ డివిజన్‌లో భారీగా వర్షాలు కురిశాయి. దీంతో ఈ ప్రాంతంలోని 198 చెరువుల్లో 171 దాకా పూర్తి స్థాయిలో నిండి మొరవెత్తాయి. కౌండిన్య నది సైతం మూడు దఫాలు ప్రవహించింది. గతంలో భారీ వర్షాల కారణంగా భూగర్భజలాలు 40 అడుగుల ఎత్తుకు చేరుకున్నాయి. ఈ ప్రాంతంలో 36వేల హెక్టార్లలో వివిధ పంటల సాగు ఉండగా 27వేల హెక్టార్లలో పంటలు సాగయ్యాయి.

ఈఏడేమో వాన పడదే..



దేశంలో ఏడ చూసినా వానలు పడుతున్నాయి. వర్షాలెక్కువై జనం ఇబ్బందులు పడుతున్నారు. కానీ మేమేమి పాపం చేశామోగాని పలమనేరు ప్రాంతంలో మాత్రం ఈ దఫా వానలు పడలేదు. దీంతో రైతులు భూములను బీళ్లుగా వదిలేశారు. కీలేర్లలో కొంచెంగా వరిని సాగు చేసుకున్నా దానికి నీళ్లు చాలడం లేదు.

–రెడ్డెప్పరెడ్డి, రైతు, టీఎస్ అగ్రహారం

బోర్లలో నీళ్లు తగ్గిపోయ..



మా మండలంలోనే గతనాలుగేళ్లలో కొందరి రైతుల బోర్లలో నీళ్లు పైకి పొంగిపోయ. గంగమ్మ కనుకరించిందని పూజలు కూడా చేసిరి. ఈ ఏడాదిలో మార్చి దాకా కూడా బోర్లలో నీళ్లు బాగానే ఉన్నాయి. ఇప్పుడేందిరా అంటే అర ఇంచి కూడా రాలేదు. కొన్ని బోర్లలో నీళ్లు రావడమే లేదు. పంటలకు ఎలా నీరు ఇవ్వాలో అర్థం కావడం లేదు. ఈనెలలో వానలు పడకుంటే ఇక అంతే సంగతులు.

–గిరి, రైతు, పెంగరగుంట

పూర్వ విద్యార్థుల కలయిక


గురువులతో పూర్వవిద్యార్థులు

సోమల(పుంగనూరు): మండలంలోని కందూరు ఉన్నత పాఠశాలలో 1990–91వ సంవత్సరంలో పదో తరగతి వరకు చదువుకున్న పూర్వవిద్యార్థులు 34 ఏళ్ల తరువాత అదే పాఠశాలలో ఆదివారం కలిసేందుకు వేదికైంది. వీరందరినీ ఏకం చేయాలని ఒక్క ఆలోచన ఓదేటి రమణయ్య, మధునాయుడు, రాజగోపాల్‌నాయుడు, మల్లికార్జుననాయుడు, మనోహర్ మనసులో మెదిలింది. ఈ ఐదుగురి సహకారంతో పూర్వవిద్యార్థుల వివరాలు, వారి చిరునామా సేకరణలో ఆరునెలల పాటు శ్రమించారు. శ్రమకు తగిన ఫలితం ఆదివారం కందూరు పాఠశాలలో కనపడింది. పూర్వవిద్యార్థుల్లో ఐదుగురు మృతిచెందారని తెలుసుకొని వారి ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. ఆనాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తామని పూర్వవిద్యార్థులందరూ కలసి తీర్మానం చేశారు.

వీధుల్లో పారుతున్న మురుగు


రోడ్డు పక్కన మురుగునీరు

శాంతిపురం: శివరామపురం పంచాయతీలోని గట్టూరు కాలనీలో మురుగునీరు రోడ్డుపైనే పారుతోంది. శాంతిపురం–గోవిందపల్లి ప్రధాన రహదారి పక్కన గతంలో వర్షపు నీరు వెళ్లేందుకు తవ్విన కాలువలో నీరు నిలిచి, మురుగునీరు చేరి వీధుల్లోకి వచ్చింది. దీంతో మురుగు నీటిలో నడుస్తూ ఇళ్లకు రాకపోకలు సాగించాల్సి వస్తోందని కాలనీ వాసులు వాపోతున్నారు. దోమలు, ఈగలు తీవ్రమై రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని చెప్పారు. దీనిపై సర్పంచ్ భాస్కరరెడ్డి వివరణ కోరగా సమస్య పరిష్కరించే ప్రయత్నం చేసినా స్థానికంగా ఉన్న భూవివాదం కారణంగా దానిని తీర్చలేకపోయామన్నారు.

వర్షంతో నేల కొరిగిన వరి


మతుకువారిపల్లె వద్ద నేల కొరిగిన వరి పంట

పులిచెర్ల (కల్లూరు): చేతి కొచ్చిన వరి పంట వర్షంతో నేల కొరగడంతో పంట సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. పండిన పంట నేలవాలడంతో గింజ మసకబారడంతో పనికి రాకుండాపోతోంది. చేతికొచ్చే సమయంలో ఇలా జరగడంతో పండిన పంట కోయడానికి యంత్రాలు కూడా రాలేని పరిస్థితి. భూమిలో తేమ ఎక్కువగా ఉండడంతో కూలీలతో కోత కోయడమూ కష్టమే. దీంతో రైతులకు పంట పండినా ప్రయోజనం లేకుండా పోయింది.

చురుగ్గా 220 కేవీ సబ్‌స్టేషన్ పనులు


చదళ్ల వద్ద సాగుతున్న సబ్‌స్టేషన్ పనులు

- రూ.120 కోట్లతో సబ్‌స్టేషన్లు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాణ్యమైన విద్యుత్

పుంగనూరు: కర్ణాటక సరిహద్దులో పుంగనూరు ఉండడంతో నాణ్యమైన విద్యుత్ లేక ప్రజలు అవస్థలు పడ్డారు. ముఖ్యంగా రైతాంగం అర్ధరాత్రి కరెంటు కోసం కాపుకాయడం, ప్రమాదాలకు గురికావడం, తరచూ జరిగేది. ఇలాంటి పరిస్థితుల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసి పుంగనూరు నియోజవర్గంలో 29 సబ్‌స్టేషన్ల నిర్మాణాలు చేపట్టారు. అలాగే పుంగనూరులో ఈఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి డివిజన్ కార్యాలయం చేశారు. ఇందుకుగాను రూ.200 కోట్లతో సబ్‌స్టేషన్లు, భవన నిర్మాణాలు చేపట్టారు. చదళ్ల గ్రామంలో 220 కేవీ సబ్‌స్టేషన్‌ను రూ.100 కోట్లతో నిర్మిస్తున్నారు. అలాగే చంద్రమాకులపల్లి, పత్రపల్లి, ఆరడిగుంట, మేలుందొడ్డి గ్రామాల్లో రూ.2.50 కోట్లతో ఐదు సబ్‌స్టేషన్లు నిర్మించారు. ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల ఫ్యాక్టరీని రూ.2 కోట్లతో నిర్మించారు. ఇటుకనెల్లూరు, మాగాండ్లపల్లిలో సబ్‌స్టేషన్లు నిర్మించాల్సి ఉంది. అలాగే చౌడేపల్లెలో 5, సదుంలో 4, సోమలలో 4, పులిచెర్లలో 5, రొంపిచెర్లలో 4 సబ్‌స్టేషన్లు నిర్మించారు. వీటితోపాటు విస్తరణ ప్రాంతాల్లో విద్యుత్ లేన్లు ఏర్పాటు చేశారు. ప్రమాదాలకు గురయ్యే విద్యుత్ స్తంభాలు మార్చి కొత్త లేన్లు ఏర్పాటు చేశారు. ప్రజలకు ఎదురవుతున్న విద్యుత్ సమస్యలను పరిష్కరించి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల మన్ననలు పొందింది. ట్రాన్స్‌కో ఈఈ శ్రీనివాసమూర్తి, డీఈఈ శ్రీనివాసులు ఆధ్వర్యంలో 220 కేవీ సబ్‌స్టేషన్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. డీఈఈ మాట్లాడుతూ మూడు నెలల్లో పనులు పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన ఈసందర్భంగా తెలిపారు.

భగవద్గీత పఠనంతో విశ్వశాంతి


ప్రచారం నిర్వహిస్తున్న సమితి సభ్యులు

కుప్పంరూరల్: ప్రతిఒక్కరూ భగవద్గీత పఠనంతో విశ్వశాంతి సాధ్యమని ప్రబోధానంద కుప్పం విభాగం ప్రతినిధి కృష్ణ అన్నారు. ఆదివారం ఉర్లవోబనపల్లి, మారప్పల్లి, గట్టప్పనాయునిపల్లి, పరమసముద్రం గ్రామాల్లో ప్రబోధానంద రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. కృష్ణమూర్తి, ప్రకాశ్, నాగరాజు, శివకృష్ణ, లోకేష్, చరణ్, ఇందు, వెంకటమ్మ పాల్గొన్నారు.

పకడ్బందీగా పశుగణన

పులిచెర్ల(కల్లూరు): మండలంలో పశుగణన పకడ్బందీగా చేపట్టాలని మండల పశువైద్యాధికారి సయ్యద్‌బాషా తెలిపారు. మండలంలోని పశువైద్య కేంద్రాల పరిధిలోని అన్ని గ్రామాల్లో సిబ్బంది పర్యటించి కచ్చితమైన డేటా తయారు చేయాలన్నారు. దీని కనుగుణంగానే ఏఏ గ్రామాల్లో ఎన్ని రకాల పశువులు ఉన్నాయో కచ్చితమైన సమాచారం వస్తుందన్నారు.

తెరుచుకోని గ్రంథాలయం



మూతపడ్డ గ్రంథాలయం

పెద్దపంజాణి: మండల కేంద్రంలోని గ్రంథాలయానికి రెగ్యులర్ లైబ్రేరియన్ లేక తెరుచుకోవడం లేదు. గ్రంథాలయం తెరుచుకోకపోవడంతో పాఠకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పోటీ పరీక్షలకు శిక్షణ తీసుకునే నిరుద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గత కొన్నేళ్లుగా లైబ్రేరియన్ పోస్టు ఖాళీగా ఉంది. వారానికి ఒక్క రోజు మాత్రమే ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ గ్రంథాలయాన్ని తెరుస్తున్నారు. ఉన్నతాధికారులు పట్టించుకుని లైబ్రేరియన్‌ను నియమించి గ్రంథాలయం ప్రతి రోజు తెరుచుకునేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఏటిగడ్డపాళెంలో పోలీసుల తనిఖీ

పుంగనూరు: పట్టణంలోని ఏటిగడ్డపాళెంలో ఆదివారం ఉదయం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎస్‌ఐ లోకేష్, పోలీసులు ప్రతి ఇల్లు జల్లెడ పట్టారు. అనుమానితులను, వాహనాలను పరిశీలించారు. ఈసందర్భంగా 10 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు.

అలరించిన చిన్నారుల నృత్యప్రదర్శన


చర్చిలో ప్రపంచ పిల్లల పండుగలో చిన్నారులు

పుంగనూరు: పట్టణంలోని సీఎస్ఐ హట్టన్ మెమోరియల్ చర్చిలో ఆదివారం ప్రపంచ పిల్లల ఆదివారం పండుగను నిర్వహించారు. పాస్టర్ రాఖేష్‌నిమ్రోద్ ఆధ్వర్యంలో చిన్నారులు వివిధ నృత్యప్రదర్శనలు చేశారు. బైబిల్ చదివి కీర్తనలు ఆలపించి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సండే స్కూల్ టీచర్లు ఎస్తేరురాణి, సనులత, హేంద్రిహేమంత్, చర్చి ప్రతినిధులు రవికుమార్, భరత్ భూషణ్, సురేష్ క్రిష్టోఫర్, చిట్టి, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

కరువు మండలంగా రొంపిచెర్ల


ఖరీఫ్ సీజన్‌లో మండలంలో దెబ్బ తిన్న వేరుశనగ పంట(ఫైల్)

రొంపిచెర్ల: రొంపిచెర్ల మండలాన్ని కరువు మండలంగా ప్రభుత్వం ప్రకటించింది. 2023–24 సంవత్సరంలో మండలంలో 1,407 హెక్టార్లలో వేరుశనగ పంట సాగు చేశారు. అయితే వర్షాలు కురవకపోవడంతో రైతులు సాగు చేసిన పంట పూర్తిగా దెబ్బతింది. కనీసం రైతులు పంట సాగు కోసం చేసిన కూలి కూడా రాలేదు. దీంతో రెవెన్యూ అధికారులు జిల్లా అధికారులకు నివేదిక పంపారు. దీంతో ప్రభుత్వం నివేదికలను పరిశీలించి రొంపిచెర్ల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించింది. వేరుశనగ పంటతో పాటు వరి, టమాట పంట కూడా దెబ్బ తిన్నాయి. ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకుని కరువుతో దెబ్బ తిన్న రైతులకు నష్టపరిహారం మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

యూటీఎఫ్ కార్యవర్గం ఏకగ్రీవం




నగేష్, శంకర్‌రెడ్డి

పెద్దపంజాణి: పెద్దపంజాణి మండల యూటీఎఫ్ కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని రాయలపేట ఎంపీపీ(తెలుగు) పాఠశాలలో పెద్దపంజాణి యూటీఎఫ్ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా కొలత్తూరు ఎంపీయూపీ పాఠశాల హెచ్‌ఎం నగేష్, ప్రధాన కార్యదర్శిగా శ్రీరామాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు శంకర్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడిగా రాయలపేట ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషిచేస్తామని ఈసందర్భంగా వారు చెప్పారు.

మండలాభివృద్ధికి కృషిచేద్దాం

- ఎంపీపీ యువరాజ్

వి.కోట: పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు మండలాభివృద్ధికి కృషిచేద్దామని ఎంపీపీ యువరాజ్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన స్థానిక ట్రావెల్స్ బంగ్లాలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశం ఈనెల 6న నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వంలో తొలిసారిగా నిర్వహిస్తున్నామన్నారు. కావున ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తూ పార్టీలకతీతంగా మండల కార్యవర్గంతోపాటు ప్రజాప్రతినిధులు అందరి సంపూర్ణ సహకారాలు ప్రస్తుతం అవసరమన్నారు. గతంలో మండలాభివృద్ధి విషయంలో ఆరోపణలు, ప్రత్యారోపణలతో కొంత గందరగోళ పరిస్థితులు మండలంలో నెలకొన్నాయి. అంతేకాక పుంగనూరు అల్లర్ల కేసులతో నాకు ఎలాంటి సంబంధం లేదన్నారు. పార్టీలకతీతంగా అన్ని పార్టీల వారు కలసిమెలసి మండల అభివృద్ధికి కృషి చేద్దామని చెప్పారు. సర్వసభ్య సమావేశం సజావుగా జరగడానికి అందరూ సహకరించాలన్నారు.



కప్పుకున్న మంచు దుప్పటి

మండల కేంద్రంతో పాటు పలు ప్రాంతాల్లో ఆదివారం వేకువజామున దట్టమైన పొగమంచు కురిసింది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలిగాయి. కాగా మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురిశాయి.

–సదుం

నేడు సామాజిక తనిఖీ సమావేశం

వి.కోట: ఉపాధి హామీ పథకం కింద 2023–24 సంవత్సరంలో వివిధ శాఖల ఆధ్వర్యంలో జరిగిన పనులపై సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఈశ్వరన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు స్థానిక స్త్రీశక్తి భవనంలో నిర్వహిస్తామన్నారు. సామాజిక తనిఖీ సిబ్బంది, సంబంధిత అధికారులతో నిర్వహించే సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచులు, పీఆర్ ఏఈలు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బంది తప్పక హాజరుకావాలని ప్రకటనలో కోరారు.